సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును వివరించండి

మైదుకూరు : సీఎం వైఎస్ జగన్ ప్రజలకు చేసిన మేలును, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరు మున్సిపాలిటీలోని 9వ సచివాలయ పరిధిలో గురువారం 'రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అమలు చేశారన్నారు. దేశంలో దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని, వీటి ద్వారా సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను ప్రజలకు కుల, మత, పార్టీ రహితంగా అందించారని కొనియాడారు. చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. వైఎస్ జగన్ 2019 ఎన్నికలకు ముందు ఏమి చెప్పారో అదే చేశారని, ఇచ్చిన హామీల్లో 95 శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని పేర్కొన్నారు.

రూ.35.55 కోట్లు లబ్ధి

మున్సిపాలిటీలోని 9వ సచివాలయం పరిధిలో ఇప్పటి వరకు రూ.35.55 కోట్ల మేరకు ప్రజలకు లబ్ధి చేకూరినట్లు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. ఏ పథకం కింద ఎంత మందికి, ఎంత లబ్ధి చేకూరింది అనే వివరాలతో ఏర్పాటు చేసిన బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం నంద్యాల రోడ్డులో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు మదీనా దస్తగిరి, పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, వార్డు కౌన్సిలర్ కె.పార్వతి, భరత్ కుమార్‌రెడ్డి, భూమిరెడ్డి సుబ్బరాయుడు, కూశెట్టి రాయుడు, వీరభద్రుడు, పిల్లి నాగయ్య, ట్రాక్టర్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

జగనే మళ్లీ సీఎం కావాలి: ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు క్రైం : ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం 12వ వార్డులోని రాయల్ ఫంక్షన్ హాల్ వద్ద ఎమ్మెల్యే రాచమల్లు పార్టీ జెండా ఆవిష్కరించి 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలోని అన్ని హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలన్నారు. అనంతరం 13వ సచివాలయ పరిధిలో లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల బోర్డును మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చొరవతో ప్రొద్దుటూరులో రూ. వందలాది కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్లు ఖాజా మాట్లాడుతూ 14 ఏళ్లపాటు అధికారంలో ఉండి ఏమీ చేయలేని చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు మోసపూరిత వాగ్దానాలతో మళ్లీ ప్రజల ముందుకు వస్తున్నారని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రమణయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, కామిశెట్టి బాబు, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, జిలాన్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



మైదుకూరు:లబ్ధిని వివరించే బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



ప్రొద్దుటూరు:వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు



బద్వేలు : లబ్ధిని తెలిపే బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగడంతో పాటు పేదలకు మరింత మేలు జరగాలంటే మళ్ళీ జగనన్నే సీఎం కావాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆంజనేయనగర్ సచివాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయం పరిధిలోని ఆయా కుటుంబాలకు గడిచిన నాలుగున్నర ఏళ్ళ కాలంలో ప్రత్యక్ష నగదు బదిలీ, పరోక్ష ప్రయోజనాలు కింద చేకూరిన లబ్ధిని తెలిపే బోర్డును ప్రదర్శించారు. అనంతరం సచివాలయం ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా సచివాలయం పరిధిలోని ప్రజలతో సహపంక్తి భోజనం చేసి రాత్రినిద్రకు ఉపక్రమించారు. శుక్రవారం ఉదయం ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం చేసిన మేలును వివరించనున్నారు. వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, వార్డు కౌన్సిలర్లు చెవులవెంకటేశ్వర్లు, రవితేజ, కో ఆప్షన్ మెంబర్ రామచంద్రారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంతోనే మరింత అభివృద్ధి

బి.కోడూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తెచ్చుకుంటేనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మేకవారిపల్లెలో సర్పంచ్ పెద్దిరెడ్డిరమణమ్మ ఆధ్వర్యంలో ఎంపీడీఓ భాస్కర్‌రావు అధ్యక్షతన ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, జెడ్పీటీసీ సంగటి దావీదు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్ల కాలంలో రాష్ట్రంలోని రైతులు రైతుభరోసా, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాల ద్వారా మరింత అభివృద్ధి చెందడంతో పాటు పంటలు సమృద్ధిగా పండించుకోగలిగారని తెలిపారు. మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, ఉప సర్పంచ్ శివారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుజన, వీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ బ్రహ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరెడ్డి, రమణారెడ్డి, నారాయణరెడ్డి, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

మేలు చేసే సీఎంకు అండగా ఉందాం

ఖాజీపేట : ప్రజల సంక్షేమం కోసం నిత్యం పాటుపడే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని.. ఆయనకు మనం అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. ఏపీకి సీఎం జగన్ ఎందుకు అవసరం అనే కార్యక్రమం మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగసానిపల్లె గ్రామంలో జరిగింది. సచివాలయంలో నాగసానిపల్లె పంచాయతీకి నాలుగున్నర ఏళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి పనుల బోర్డును కన్వీనర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఏపీఐఐసీ డైరెక్టర్, ఎంపీపీ అబుబకర్ సిద్దిక్, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డిల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు కరీముల్లా, అగ్రహారం సొసైటి అధ్యక్షుడు రాఘవరెడ్డి, సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, నక్కా రమాదేవి, మండల ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్ జగన్‌నే గెలిపించుకుందాం

మైదుకూరు : రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని అన్నలూరులో గురువారం 'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, బండి నాగేంద్రప్రసాద్ ఏవీ సుబ్బారెడ్డి, గల్లా నరసింహారెడ్డి తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా మార్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ థామస్, మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి, ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి, ఈఓపీఆర్డీ సుధాకర్, అన్నలూరు సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సీర్ల గంగమ్మ, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గౌస్ లాజం, వనిపెంట ఎంపీటీసీ ఇర్షాద్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

చౌదూరులో..

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని చౌదూరు సచివాలయంలో గురువారం 'ఏపీకి మళ్లీ జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పథకాల ద్వారా ప్రజలు ఎంత లబ్ధి పొందారు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజాప్రతినిధులు, నాయకులు వివరించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, జెడ్పీటీసీ శారద, మార్తల ఓబుళరెడ్డి, ఓబయ్య, గ్రామ సర్పంచ్ చంద్రుడు, పల్లా లక్ష్మీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాపాడు : గతంలో ఏ ప్రభుత్వం.. ఏ ముఖ్యమంత్రి ప్రజలకు చేయలేనన్ని మంచి పనులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారని.. జగనన్న చేసిన మంచిని ప్రజలకు తెలియజేయాలని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. మండలంలోని బద్రిపల్లె గ్రామ సచివాలయ పరిధిలో గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి డిస్ ప్లే బోర్డును ప్రదర్శించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, జేసీఎస్ మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, విశ్వనాథపురం సర్పంచ్ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, ఓబుళరెడ్డి, నరసింహారెడ్డి, సచివాలయ కన్వీనర్లు ఓబుళరెడ్డి, ప్రకాశ్, దళిత నాయకుడు బండి పుల్లయ్య, ఈశ్వర్‌రెడ్డి, బోరెడ్డి చంద్ర పాల్గొన్నారు.

గోపవరం : మండలంలోని బేతాయపల్లె సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ముందుగా సచివాలయ ఆవరణలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్య, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి నాగరాజ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నాలుగున్నర ఏళ్ళ పాలనలో సచివాలయం పరిధిలోని 811 కుటుంబాలకు 33 సంక్షేమ పథకాలకు సంబంధించి డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.17.40 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, మల్లెంకొండ చైర్మన్ గోవిందరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, మాజీ ఎంపీటీసీ సాంబశివారెడ్డి, పార్టీ నాయకులు కె.శ్రీరాములు, కె.వెంకటేశ్వర్‌రెడ్డి, మల్లేష్, హరికృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, ఎంపీడీఓ హసీనా, ఏఓ అరవిందనాయక్ పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసినందుకు ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, రాజశేఖర్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం సిద్దవరం సచివాలయంలో నిర్వహించిన 'జగన్ ఆంధ్రాకే ఎందుకు కావాలి' కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మీదేవి, జేసీఎస్ కన్వీనర్ రమణారెడ్డి, ఉప సర్పంచ్ రమణారెడ్డి, యువనాయకుడు గిరిప్రణీత్ రెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : ప్రతి నిరుపేదకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కావాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఉంటేనే ఆ పథకాలు అందుతాయని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం – 2లో జరిగిన రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం మండల పార్టీ కన్వీనర్ మేకల రత్నకుమార్‌యాదవ్, ఎంపీడీఓ వెంగమునిరెడ్డిలు ప్రారంభించారు. సచివాలయం సమీపంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఎంపీటీసీ యల్లటూరి ఈశ్వర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రాజానాయుడు, సర్పంచ్ ఎస్.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు : ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రభుత్వం చేసిన మేలును వివరించాలని మైదుకూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం గుడిపాడు గ్రామంలో జరిగిన పల్లెకు పోదాం, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, గోపిరెడ్డి బాబు, సచివాలయాల కన్వీనర్ శేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిరాకి బాషా, మండల స్పెషల్ ఆఫీసర్ ఓబులేసు నందన్, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, తహసీల్దార్ రమకుమారి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాచమల్లు చొరవతో తీరిన మంచి నీటి కొరత

ప్రొద్దుటూరు క్రైం : ఎన్నో ఏళ్ల నుంచి మంచి నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న యానాది కాలనీ వాసుల కష్టాలు తొలగిపోయాయి. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చొరవతో ఇకపై కాలనీ వాసులకు పుష్కలంగా మంచి నీరు లభించనుంది. గోపవరం పంచాయతీలోని యానాది కాలనీకి రూ.45 లక్షలతో పెన్నానది నుంచి పైప్‌లైన్ ద్వారా ఏర్పాటు చేసిన మంచి నీటి పథకాన్ని గురువారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. చాలా ఏళ్ల నుంచి ఉన్న నీటి సమస్య తీరడంతో యానాది కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గోపవరం మాజీ సర్పంచ్ దేవిశ్రీప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ ఓబయ్య యాదవ్, మార్కెట్‌యార్డు కమిటీ మెంబర్ గోకుల మేరీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సంజీవనగర్‌లో సీసీ రోడ్డుకు భూమిపూజ


మున్సిపాలిటీ పరిధిలోని సంజీవనగర్‌లో రూ. 8 లక్షలతో ఏర్పాటు చేయనున్న సిమెంట్ రోడ్డుకు గురువారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి భూమి పూజ చేశారు. అలాగే వార్డులోని వైఎస్సార్‌సీపీ నాయకురాలు లక్ష్మీదేవి అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలుసుకొని ఎమ్మెల్యే రాచమల్లు ఆమె ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, వార్డు కౌన్సిలర్ రాగుల శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవ, చిన్న ఓబులేసు, కళ్యాణ్, హరి నారాయణ, వినోద్, నారాయణ, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.



నీటి పథకం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాచమల్లు, పార్టీ నాయకులు

9న గర్భిణుల కోసం వైద్య శిబిరం

చాపాడు : గ్రామీణ ప్రాంతాలలోని గర్భిణులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అందే వైద్య సేవలను వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి డా.రాజేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత అభియాన్ యోజనా పథకం కింద ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాలైన వైద్య సేవలు అందించటం జరుగుతుందన్నారు. ప్రతి నెలా 9వ తేదీన నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరంలో గర్భిణులు పాల్గొని వైద్యం చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తారన్నారు. గర్భిణులు పోషకాహారం తీసుకుంటూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వైద్య శిబిరానికి హాజరైన వారికి విశ్వనాథపురం గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి కార్తీక్ రెడ్డి భోజన సౌకర్యం కల్పించారు. వైద్యులు శ్రీవాణి, ఓబులేసు, గైనకాలజిస్టు జ్యోతి, సీహెచ్‌ఓ మహదేవ యాదవ్, పీహెచ్‌ఎన్ సుకన్య, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి రాజేష్ కుమార్

బ్రహ్మంగారిమఠం : గర్భిణులు తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల 9వ తేదీన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని బి.మఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మల్లేష్ తెలిపారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణులకు వైద్యపరీక్షలు చేసిన అనంతరం డాక్టర్ మాట్లడుతూ ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం ప్రతి నెల 9వ తారీఖున ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ఈ గురువారం పీహెచ్‌సీ పరిధిలో 20 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు చేశామని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పరాజ్, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్ మాదవ్, వెంకటసుబ్బయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పద్మాశ్రీ తెలిపారు. న్యాయసేవల దినోత్సవం సందర్భంగా గురువారం ఎద్దుల వెంకటసుబ్బమ్మ బాలికల పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ రాజీమార్గంతో వెళ్లి కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ తీర్పు సుప్రీంకోర్టుతో సమానమన్నారు. ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి హారిక మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అవమాన పరచడం, పోక్సో యాక్ట్ గురించి వివరించారు. సమాచార హక్కు చట్టం గురించి తెలుసుకొని చదువులేని వారికి తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ముడిమేల కొండారెడ్డి, బి. ఓబులేసు, ఎం.లక్ష్మీప్రసన్న, ఎస్.ఓబులేసు, ఎం.రమేష్ కుమార్, పాఠశాల హెచ్‌ఎం కాశీప్రసాద్‌రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పద్మాశ్రీ

12 నుంచి నామా ఎరుకలయ్య ఆరాధనోత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ కృష్ణగీతాశ్రమంలో ఈ నెల 12 నుంచి 21 వరకు నామా ఎరుకలయ్య, నామా కమలాక్షమ్మ ఆరాధన ఉత్సవాలను నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఏసీ, ఈఓ శంకబాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. 12న ఉదయం గీతాపారాయణం, సాయంత్రం యడవల్లి రమణయ్య భాగవతార్‌చే కృష్ణ తరంగం ఆలాపన, 13న మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం, సాయంత్రం డాక్టర్ కృష్ణమాచార్యులతో బ్రహ్మంగారి కాలజ్ఞాన ప్రవచనాలు ఉంటాయన్నారు. 14, 15, 16న సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనాలు, 17న సాయంత్రం తాళాల హరిభజన, 18న పసుపులేటి శంకర్‌చే ఆధ్యాత్మిక ప్రవచనాలు, 19, 20 తేదీల్లో సాయంత్రం నటరాజ కళాక్షేత్రం మొహిద్దీన్ ఖాన్ శిష్యులచే భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు, సాంప్రదాయ నృత్యాల ప్రదర్శన ఉంటుందన్నారు. 21న యడవల్లి రమణయ్య భాగవతార్‌చే హరికథా కాలక్షేపం నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. అలాగే రోజూ భగవద్గీతా పారాయణం, అన్నప్రసాద వినియోగం, దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు.

పరిశోధన సంస్థల సందర్శన

మైదుకూరు : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థులు, కడప ఆర్ట్స్ కళాశాల విద్యార్థులతో కలిసి గురువారం పులివెందులలోని ప్రఖ్యాతిగాంచిన ఏపీ కార్ల్ పరిశోధన సంస్థ, ప్లాంటిజన్ పరిశోధన కేంద్రాలను సందర్శించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి తెలిపారు. వృక్ష కణజాల వర్ధన అవశ్యకతను, ముఖ్యంగా అరటి కణజాల వర్ధన విధానాలను విద్యార్థులకు ప్లాంటేషన్ అగ్రి సొల్యూషన్స్ అధినేత డాక్టర్ మల్లికార్జున, పరిశోధక బృందం విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. జినోమిక్స్ విభాగంలో జరుగుతున్న పరిశోధన అంశాలను వివిధ ప్రయోగ పరికరాల పనితీరును ఐజీ కార్ల్ శాస్త్రవేత్త డాక్టర్ జనార్ధన్ వివరించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల వెంట వృక్షశాస్త్రధ్యాపకులు డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ శివరామకృష్ణ, తిలక్, విద్యాసాగర్ ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక



ఎస్.రమణయ్య



బల్లాని చెన్నకేశవ ప్రసాద్

మైదుకూరు : మండల స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎస్.రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా బల్లాని చెన్నకేశవ ప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా కేఎస్ అబీద్ ఆలీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాలరాజు, రామచంద్రారెడ్డి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు కె.పాలకొండయ్య, వై.వెంకటసుబ్బయ్య, జీఆర్ మల్లేశ్వర రెడ్డి, బీకే సురేష్, వెంకటేశ్వర రాజు, సుధా, పరిమిళ, అపర్ణ, పద్మజ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు కార్మికుల వినతి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ మున్సిపాలిటీ శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికులను సీనియారిటీ ఆధారంగా మేస్త్రీలుగా డిప్యుటేషన్‌పై కొనసాగించాలని కోరారు. దశాబ్దాల కాలంగా పారిశుధ్య సేవలో పనిచేస్తూ రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న వారు ఎక్కువ మంది ఊపిరితిత్తుల సమస్య, ఇతర వ్యాధులతో బాధపడుతున్నారని చెప్పారు. యువకులను డిప్యుటేషన్‌పై పంపడం ద్వారా పనిభారం సీనియర్ కార్మికులపై పడుతుందన్నారు. వారికి కొంత ఉపశమనం కలిగించేలా మేస్త్రీ బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పట్టణ కార్యదర్శి మధు, వర్కింగ్ ప్రెసిడెంట్ నిర్మల, ఉపాధ్యక్షుడు రూబెన్, కోశాధికారి ఓబులేసు, సమితి సభ్యులు సురేష్, మధు, శ్రీను, నరసింహులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనాన్ని అలవరచుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శాస్త్రీనగర్‌లోని శివదర్శనానంద సరస్వతీ మాతాజీ ఆశ్రమంలో గురువారం విద్యార్థులకు జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలను నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు భగవద్గీతలోని 4వ అధ్యాయం జ్ఞానకర్మసన్యాస యోగ అంశంపై పఠన పోటీలు జరిపారు. ఈ సందర్భంగా శివదర్శనానంద సరస్వతీ మాతాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలన్నారు. దీని వల్ల మంచి,చెడు, విచక్షణ జ్ఞానం తెలుస్తుందని, సంస్కారం అలవడుతుందని వివరించారు. గెలుపొందిన వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ పోటీలకు డాక్టర్ మూలె రామునిరెడ్డి, సుబ్బిరెడ్డి, పల్లా నరసింహులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఏ–కేటగిరిలో సాత్విక రెడ్డి (సాయిరవీంద్ర), బి–కేటగిరిలో పర్వేష్ (సరోజిని), సి–కేటగిరిలో అక్షయ (రవీంద్రహైస్కూల్), డి–కేటగిరిలో వీర షణ్ముఖచక్రి (బాలతత్సంగం), ఈ–కేటగిరిలో విశాలాక్షి (ఆదిత్య)లు ప్రథమ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లేటి ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ భవన్‌కు స్థలం కేటాయించాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలో బీసీ భవన్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తి పేర్కొన్నారు. గురువారం సిద్దవటం రోడ్డులోని సంఘమిత్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు బంగారుశీనయ్య మాట్లాడుతూ కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల ద్వారా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి బీసీ భవన్ ఏర్పాటుకు స్థలం మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు రాజగోపాలయ్య, వర్కింగ్ అధ్యక్షుడు రమణ, నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రాజు, వివిధ సంఘాల నాయకులు సింగరయ్య, వజ్రాల వెంకటస్వామి, రొయ్యలక్రిష్ణ, వెంకటరమణ, రాజగోపాల్ పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు : హైదరాబాద్‌లో ఈనెల 11న మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు ఇల్లూరి శివశంకర్ మాదిగ, గడ్డం నరసింహులు మాదిగ తెలిపారు. గురువారం స్థానిక ఎర్రన్నకొట్టాలులో విశ్వరూప మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 27 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని తెలిపారు. ఈనెల 11న హైదరాబాద్‌లో ఎస్సీ వర్గీకరణ జరగాలని నిర్వహించే విశ్వరూప మహాసభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు శ్రీనుమాదిగ, రమేష్ మాదిగ, పుల్లయ్య మాదిగ, రంగా మాదిగ, రమణ మాదిగ, సుబ్బరాయుడు మాదిగ, లాయర్ల సంఘం నాయకుడు ఓబులేసు, శేఖర్ ఆచారి పాల్గొన్నారు.

రసాయన, పురుగుమందు అవశేషాలు లేని పంటల ఉత్పత్తే లక్ష్యం

ప్రొద్దుటూరు : రసాయన, పురుగు మందు అవశేషాలు లేని పంటల ఉత్పత్తే లక్ష్యమని జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ రమణారెడ్డి తెలిపారు. మండలంలోని తాళ్లమాపురం, కల్లూరు గ్రామాల్లో గురువారం పొలం బడి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సువిధ వ్యవసాయ పద్ధతులు కార్యక్రమం ద్వారా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌లోని కొంత మంది రైతులను ఎన్నుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి, ఏపీఎస్‌ఓపీసీఏ తనిఖీ అధికారి డాక్టర్ ఎస్.రవి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, సీఈఓ పవన్‌కుమార్, కల్లూరు, తాళ్లమాపురం గ్రామాల రైతులు, సీఎస్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ధ్రితి ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ అనూష వల్లంకొండు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యాధికారి హిమబిందు మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో 32 మంది గర్భిణులకు పరీక్షలు చేసినట్లు తెలిపారు. ధ్రితి ఆస్పత్రిలో ప్రతినెల రెండో శుక్రవారం గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కార్డియాలజిస్టు డాక్టర్ పి.వెంకటచెంచయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవీ సుబ్బారెడ్డి, యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపరిహారం కోసం వినతిపత్రం

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ జీబీనగర్ కాలనీలో పేదల ఇళ్లు కూలగొట్టిన ఘటనలో నష్టపరిహారం ఇప్పించాలని గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ మాట్లాడుతూ నాలుగురోజుల క్రితం ఇళ్లలో ఎవరూ లేని సమయంలో రెవెన్యూ అధికారులు జేసీబీతో రేకుల షెడ్లు కూలదోశారన్నారు. కూలదోసిన ఇళ్లకు నష్టపరిహారం ఇప్పించాలని, కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, అక్కడే ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గౌసియాబేగం, బీబీ, మేరీ, రవి, చిన్నయ్య, రమణయ్య, బాలగురయ్య తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

ప్రొద్దుటూరు క్రైం : ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో కలిసి పని చేయాలని సీడీపీఓ అరుణకుమారి తెలిపారు. కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ మాతా శిశుమరణాలు, పోషకాహార లోపం లేని సమాజం కోసం అందరూ పని చేయాలన్నారు. సమయానికి వ్యాధి నిరోధక టీకాలను ఇప్పించాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, యుక్తవయస్సు గల అమ్మాయిల్లో రక్తహీనత లేకుండా చూడాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి మాట్లాడుతూ బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఈశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్ పాల్గొన్నారు.

మినుము పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఏఓ శివరామకృష్ణారెడ్డి

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలో రైతులు సాగు చేసిన మినుము పంటను గురువారం మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణారెడ్డి పరిశీలించారు. దీని నివారణకు బారాజెడ్ మందును ఎకరానికి 400 ఎంఎల్ లేదా యాంప్లిగో ఎకరానికి 80 ఎంఎల్ లేదా ప్రొక్లెం వంద గ్రాములు ఈ మూడింటిలో ఏదో ఒక రకం మందును పిచికారీ చేయడం వల్ల లద్దె పురుగును సమర్థవంతంగా నివారించవచ్చని ఏఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ఝాన్సీ, రైతులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన దివ్యాంగ విద్యార్థులు

చాపాడు : కడప నగరంలోని అవుట్ డోర్ స్పోర్ట్స్ స్టేడియంలో బుధవారం జిల్లాస్థాయి దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు నిర్వహించిన పరుగు పందెం పోటీలలో చాపాడు మండలానికి చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ చాటారు. చాపాడు భవిత కేంద్రం నుంచి ఐఈఆర్పీలు గంగాదేవి, ప్రేమకుమారిల ఆధ్వర్యంలో కరీముల్లా, హేమలత, గురుమోక్షజ్ఞ, కబీర్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా అభియాన్ పీఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఐఈ కోర్డినేటర్ కేశవరెడ్డి, అసిస్టెంటు ఉమామహేశ్వర్ రెడ్డి చేతులమీదుగా ప్రతిభ చాటిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందించారన్నారు.

దారికి అడ్డంగా విద్యుత్ స్తంభం

పోరుమామిళ్ల : రామాయపల్లెలో ఏర్పాటుచేస్తున్న 33 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు వేస్తున్న విద్యుత్‌స్తంభాల వల్ల దారికి ఆటంకం కలిగి ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయని వివిధ కాలనీల ప్రజలు తహసీల్దారు గంగయ్యకు విజ్ఞప్తి చేశారు. 16 అడుగుల దారిలో 3 అడుగుల సిమెంట్ పిల్లర్ వేస్తే ట్రాఫిక్ సమస్య ఉంటుందని కాలనీల వాసులు తహసీల్దారుకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దారు గంగయ్య గురువారం పిల్లరు వేసిన స్థలాన్ని పరిశీలించారు.